# డ్రాగన్ సామ్రాజ్యం



హృతిక్, తారక్ హీరోలుగా అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యష్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న 'వార్ 2' చిత్రం షూటింగ్ ముంబై పరిసరాల్లో శరవేగంగా జరుగుతున్నది. ఇంకొన్ని రోజుల్లో ఎన్టీఆర్ పార్ట్ కంప్లీట్ కానున్నదని బీటౌన్ సమాచారం. ఈ నెలాఖరు నుంచి ప్రశాంత్ నీల్ సినిమా షూటింగ్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నారు తారక్. ఇందులో మలయాళ హీరోలు బీజూ మీనన్, టోవినో థామస్ కీలక పాత్రలు పోషిస్తున్న విషయం తెలిసిందే. కథానాయికగా రుక్మిణి వసంత్ ఖరారైంది. మిగిలిన నటీనటులు, సాంకేతిక నిపుణులు కూడా ఖరారయ్యారట. వారి వివరాలను ప్లాన్ ప్రకారం ఒక్కొక్కటిగా రివీల్ చేయాలని ప్రశాంత్‌నీల్ భావిస్తున్నారట. ఇదిలా వుంటే.. ఈ సినిమా కథకు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూశాయి. ఇది డ్రగ్స్ మాఫియా చుట్టూ తిరిగే కథ అని ఇన్‌సైడ్ టాక్. థాయిలాండ్, మయన్మార్, లాయిస్‌లను కలిపి భౌగోళికంగా గోల్డెన్ ట్రయాంగిల్ అంటారు. ఇక్కడి నుంచే కొకైన్, గంజాయి స్మగ్లింగ్ అవుతూవుంటాయి. మాదకద్రవ్యాల సామ్రాజ్యానికి అదో స్వర్గధామం. అక్కడ జరిగే అరాచకాలు, అక్రమాల నేపథ్యంలో ఈ కథ నడుస్తుందట. 'డ్రాగన్' అనే పేరు దాదాపు ఖరారైందని సమాచారం. ఆగస్ట్‌లోగా షూటింగ్ కంప్లీట్ చేసి, నాలుగు నెలల పాటు పోస్ట్ ప్రొడక్షన్‌కి కేటాయించనున్నారట ప్రశాంత్‌నీల్. వచ్చే ఏడాది జనవరిలో సినిమా విడుదల కానుంది.

# రజనీకాంత్ బయోపిక్ తీస్తా!



శంకర్ సినిమాలంటే భారీతనానికి, సామాజిక సందేశాలకు పెట్టింది పేరు. 90దశకంలోనే దక్షిణాది నుంచి పాన్ ఇండియా సినిమాలు తీసిన దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన దర్శకత్వంలో రామ్‌చరణ్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'గేమ్ చేంజర్' నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో ఆయన ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. సినీ రంగంలో విమర్శలు సాధారణమేనని, వాటిని సవాలుగా తీసుకొని తదుపరి సినిమాలను మరింత మెరుగ్గా తీర్చిదిద్దే ప్రయత్నం చేయాలని శంకర్ అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో బయోపిక్ సినిమా తీయాల్సివస్తే తాను రజనీకాంత్ జీవిత చరిత్రను వెండితెర దృశ్యమానం చేస్తానని ఆయన చెప్పారు. 'నాకు ప్రస్తుతానికైతే బయోపిక్ తీయాలనే ఆలోచన లేదు. ఒకవేళ అలాంటి ఆలోచన వస్తే రజనీకాంత్ జీవిత చరిత్రనే తీస్తాను. ఆయన ప్రయాణం ఎందరికో స్ఫూర్తిదాయకం' అని శంకర్ తెలిపారు. 'గేమ్ చేంజర్' విడుదలైన తర్వాత 'భారతీయుడు-3' సినిమాకు సంబంధించిన పనులను మొదలుపెడతానని ఆయన వెల్లడించారు.

# ఫాస్ అక్కినేని సెంటినరీ అవార్డుల ప్రదానం



ఫిల్మ్ ఎనలిటికల్ అండ్ అప్రిసియేషన్(ఫాస్) అక్కినేని సెంటనరీ అవార్డుల ప్రధానోత్సవం గురువారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఫాస్ అధినేత డాక్టర్ కె.ధర్మారావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ నటుడు బాబూమోహన్ సభా ప్రారంభం చేశారు. అక్కినేని సెంటనరీ జీవితకాల సాఫల్య పురస్కారాన్ని ప్రఖ్యాత నటుడు పద్మశ్రీ కోట శ్రీనివాసరావుకు అందించారు. తమ్మారెడ్డి భరద్వాజ్, బాబుమోహన్, రేలంగి నరసింహారావు, నటి కవిత చేతుల మీదుగా పురస్కార ప్రధానం జరిగింది. అలాగే స్వర్గీయ నిర్మాత తమ్మారెడ్డి కృష్ణమూర్తి స్థాపించిన ప్రతిష్ఠాత్మక చిత్ర నిర్మాణ సంస్థ రవీంద్ర ఆర్ట్ పిక్చర్స్‌కి అక్కినేని సెంటనరీ ఫిల్మ్ అవార్డును అందించారు. సంస్థ తరపున తమ్మారెడ్డి భరద్వాజ్ ఈ అవార్డును అందుకున్నారు. ఇంకా నటి కవితకు అక్కినేని సెంటనరీ అవార్డును అందించగా, నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణకు రజతోత్సవ సినీ జీవిత పురస్కారాన్ని అందజేశారు. ఈ అవార్డులను అందుకున్న వారిలో నటుడు అశోక్‌కుమార్, డబ్బింగ్ కళాకారుడు ఆర్‌సీఎం రాజు, గాయకుడు డి.ఏ మిత్రా, వంశీ ఇంటర్నేషనల్ సంస్థ అధినేత వంశీరామరాజు కూడా ఉన్నారు. జీవిత సాఫల్య పురస్కారంతో గౌరవించడం పట్ల కోట శ్రీనివాసరావు ఆనందం వెలిబుచ్చారు. ఇంకా సభలో పాల్గొన్న వారంతా మాట్లాడారు.

# గాయకుడు జయచంద్రన్ ఇకలేరు



ప్రముఖ మలయాళ గాయకుడు పి.జయచంద్రన్(80) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన కేరళ త్రిశ్శూర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. జయచంద్రన్ మలయాళంతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో 16వేలకు పైగా పాటలు పాడారు. తెలుగులో ఆయన పాడిన ఎన్నో పాటలు శ్రోతల్ని అలరించాయి. 'రోజావే చిన్ని రోజువే..'(సూర్యవంశం), హ్యాపీ హ్యాపీ బర్త్‌డేలు..'(సుస్వాగతం), 'అనగనగా ఆకాశం ఉంది..'(నువ్వేకావాలి).. ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో తెలుగు పాటలు ఆయన గళం నుంచి వెలువడి విశేషాదరణ పొందాయి. 'ఊరు మనదిరా'(2022) చిత్రంలోని 'నా చెల్లి చంద్రమ్మ..' ఆయన తెలుగులో పాడిన చివరి పాట. జయచంద్రన్ మరణం భారతీయ సినీ సంగీతానికి తీరని లోటని పలువురు సినీ ప్రముఖులు సంతాపం వెలిబుచ్చారు.

# కర్మ సిద్ధాంతం నేపథ్యంలో..



అను ఇమ్మాన్యుయేల్, శివ కందుకూరి లీడ్‌రోల్స్‌లో నటిస్తున్న థ్రిల్లర్ మూవీ 'బూమరాంగ్'. సినిమాటోగ్రాఫర్ ఆండ్రూబాబు దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. లండన్ గణేశ్, డా.ప్రవీణ్‌రెడ్డి వూట్ల నిర్మాతలు. ఈ చిత్రం టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని అగ్రహీరో వెంకటేష్ ఆవిష్కరించారు. కర్మ సిద్ధాంతం నేపథ్యంలో రెండు సమాంతర కథాంశాలతో ఉత్కంఠను కలిగించే థ్రిల్లర్‌గా సినిమా ఉంటుందని, తలకు గాయమై రక్తం కారుతుండగా, షాక్ స్థితిలో ఉన్న అను ఇమ్మాన్యుయేల్‌ను ఈ పోస్టర్‌లో చూడొచ్చు. కాళరాత్రి.. నిర్జీవంగా పడున్న శరీరాలు.. వీటి మధ్య నల్లని కుక్కతో నడుచుకుంటూ వస్తున్న ఓ వ్యక్తి.. ఇలాంటి భయంకరమైన వాతావరణం ఈ పోస్టర్ ఉన్నది. అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇదని, ఆండ్రూ బాబు దర్శకత్వం, సినిమాటోగ్రఫీ హైలైట్స్‌గా నిలుస్తాయని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, నిర్మాణం: బిగ్ మూవీ మేకర్స్ లిమిటెడ్ అండ్ మై3 ఆర్ట్స్.

# బాలకృష్ణతో నటించడం ఓ గౌరవం



'ఇందులో నా పేరు కావేరి. అభినయానికి ఆస్కారమున్న డీ గ్లామరస్ రోల్. ఇప్పటివరకూ నేను చేసిన పాత్రలకు పూర్తి భిన్నమైన పాత్ర. ఛాలెంజ్‌గా తీసుకొని చేశాను. దర్శకుడు బాబీ ఈ పాత్రను అద్భుతంగా డిజైన్ చేశారు.' అని కథానాయిక ప్రగ్య జైస్వాల్ తెలిపారు. బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ కొల్లి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించిన చిత్రం 'డాకు మహారాజ్'. ఈ సినిమాలో వన్ ఆఫ్‌ది హీరోయిన్‌గా నటించింది ప్రగ్యా జైస్వాల్. సంక్రాంతి కానుకగా ఈ నెల 12న చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో ప్రగ్యా విలేకరులతో ముచ్చటించింది. 'బాలకృష్ణగారితో వరుసగా సినిమా చేసే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నా. 'అఖండ'తో నా కెరీర్ మలుపు తిరిగింది. ఇప్పుడు 'డాకు మహారాజ్' లాంటి గొప్ప సినిమాలో మళ్లీ ఆయనతో కలిసి నటించే భాగ్యం దొరికింది' అంటూ ఆనందం వెలిబుచ్చింది ప్రగ్య జైస్వాల్. దర్శకుడు బాబీ ఈ కథ చెప్పినప్పుడే పెద్ద హిట్ అవుతుందని నమ్మానని, నిర్మాత నాగవంశీ పాషన్‌తో సినిమా నిర్మించారని ప్రగ్య పేర్కొన్నారు. జనవరి 12 తన పుట్టినరోజు అని, అదేరోజు 'డాకు మహారాజ్' విడుదల అవుతుండటం సంతోషంగా ఉందని ప్రగ్యా జైస్వాల్ పేర్కొంది.

# గాంధీ బాటలో ఊరి కోసం




ప్రముఖ దర్శకుడు సుకుమార్ కుమార్తె సుకృతి వేణి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'గాంధీ తాత చెట్టు'. పద్మావతి మల్లాది దర్శకురాలు. నవీన్ ఏర్నేని, యలమంచిలి రవిశంకర్, శేష సింధురావు నిర్మాతలు. జనవరి 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. గురువారం ఈ సినిమా ట్రైలర్‌ను అగ్ర నటుడు మహేష్‌బాబు సోషల్‌మీడియా ద్వారా విడుదల చేశారు. అందరి మనసులకు హత్తుకునే సినిమా ఇదని, సుకృతివేణితో పాటు టీమ్ అందరికి అభినందనలు అంటూ మహేష్‌బాబు ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. గాంధీ సిద్ధాంతాలను పాటిస్తూ ఆయన బాటలో నడిచే ఓ పాఠశాల విద్యార్థిని తన తాతకు ఇష్టమైన చెట్టును, ఊరిని ఎలా రక్షించుకుందనే సందేశాత్మక ఇతివృత్తంతో ఈ సినిమాను తెరకెక్కించారని ట్రైలర్‌ను బట్టి అర్థమవుతున్నది. ప్రపంచమంతటా అసూయద్వేషాలు పెరిగిపోయిన ప్రస్తుత తరుణంలో గాంధీజీ సిద్ధాంతాలను పాటించే ఓ పదమూడేళ్ల అమ్మాయి కథగా ఈ సినిమా ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటుందని దర్శకురాలు పద్మావతి మల్లాది పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: శ్రీజిత్ చెర్వుపల్లి, సంగీతం: రీ, రచన-దర్శకత్వం: పద్మావతి మల్లాది.

# అలాంటి పాటలే గుర్తుండిపోతాయి



సమకాలీన తెలుగు సినీ రంగంలో గీత రచయిత కృష్ణకాంత్ కలం మెలోడీ గీతాలకు పెట్టింది పేరు. అర్థవంతమైన సాహిత్యంతో లోతైన భావాలను ఆవిష్కరిస్తూ ఆయన రాసిన పాటలు చక్కటి ఆదరణ పొందాయి. నేడు కృష్ణకాంత్ జన్మదినం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'గత ఏడాది రాసిన పాటల్లో 'అడిగా అడిగా' (హాయ్ నాన్న) పాట ఎంతో సంతృప్తినిచ్చింది. అణువణువు (ఓం భీం బుష్), అంబరాల వీధిలో (ఏఆర్ఎం) పాటలకు మంచి స్పందన దక్కింది' అన్నారు. ఈ ఏడాది రాసిన పాటలన్నీ చార్ట్‌బస్టర్స్ కావడం ఆనందంగా ఉందని, తెలుగుతో పాటు తమిళ, మలయాళ డబ్బింగ్ చిత్రాలకు సంగీత ప్రియుల్ని మెప్పించే పాటలు రాయడం అదృష్టంగా భావిస్తున్నానని కృష్ణకాంత్ తెలిపారు. గతంలో సినిమా కథలు సాధారణ ప్రేక్షకుడికి బాగా కనెక్ట్ అయ్యేవని, అందుకే ఆ పాటలు చిరకాలం గుర్తుండిపోయాయని, అవకాశం దొరికితే తాను కూడా అలాంటి పాటలు రాసే ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు. ఈ ఏడాది స్క్రిప్ట్ రైటర్‌గా ప్రయత్నాలు చేస్తున్నానని, దర్శకత్వం కూడా చేయాలనే ఆలోచన ఉందన్నారు. ప్రస్తుతం చేస్తున్న సినిమాల గురించి మాట్లాడుతూ 'ప్రభాస్, హనురాఘవపూడి సినిమాలో రెండు పాటలకు వర్క్ మొదలుపెట్టాం. అలాగే రాజాసాబ్, రామ్ పోతినేని, విజయ్ దేవరకొండ-గౌతమ్‌తిన్ననూరి కాంబినేషన్‌లో రానున్న సినిమాకు పాటలు రాస్తున్నా' అన్నారు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.